## క్లుప్తంగా

### రోడ్డుపై నాట్లతో నిరసన

**గుండాల:** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఆళ్లపల్లి మండల మర్కోడు పంచాయతీ కేంద్రంలో శనివారం ఓ అంతర్గత రోడ్డుపై బురదలో స్థానిక మహిళలు నాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. రోడ్లపై నీళ్లు నిలుస్తున్నాయని నడవలేక పోతున్నామని వాపోయారు. డ్రెయినేజీ వ్యవస్థ లేక నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

### పశువుల వ్యాన్ స్వాధీనం

**అశ్వారావుపేటరూరల్:** అనుమతులు లేకుండా కబేళాకు పశువుల్ని తరలిస్తున్న వ్యానును పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై శివ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం చిత్రంపేటకు చెందిన పల్లూరి ఏసుబాబు అనే వ్యక్తి, అశ్వారావుపేట మండలం నందిపాడులో రెండు ఆవులు, మూడు ఆవు దూడలను కొనుగోలు చేసి వ్యానులో తరలిస్తుండగా శనివారం అశ్వారావుపేటలో పట్టుకున్నారు. కాగా, పశువుల రవాణాకు ఏలాంటి అనుమతి లేకపోవడంతో ఏసుబాబుతోపాటు వ్యాన్ డ్రైవర్ మానుకొండ ప్రకాశ్, వ్యాను యజమాని తనగాల మురళిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడిన పశువులను గోశాలకు తరలించినట్లు చెప్పారు.

### ఇంటిపై కూలిన చెట్టు

**అశ్వాపురం:** భారీ వర్షానికి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గంలో శనివారం రాత్రి భారీ వృక్షం రేపాక నాగమ్మ ఇంటిపై కూలింది. భారీ వృక్షం ఇంటిపై కూలడంతో ఇంటిపై కప్పుపై రేకులు పూర్తిగా పగిలిపోయాయి. మహిళ నిరాశ్రయురాలైంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని మహిళ కోరుతోంది.

### దివ్యాంగులకు అవగాహన

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం వరదల సమయంలో దివ్యాంగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఆపద సమయంలో బయటపడే మార్గాలపై ఎన్డీఆర్ఎఫ్ అధికారి భూపేంద్రకుమార్ నేతృత్వంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా భద్రాచలం ఆర్డీఓ దామోదర్ పాల్గొనగా, దాదాపు 30 మంది దివ్యాంగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

**బాలల హక్కులపై..**

**మణుగూరురూరల్:** మండలంలోని మణుగూరు జిల్లా పరిషత్ కోఎడ్యుకేషన్ పాఠశాలలో కైలాష్ సత్యార్థి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో శనివారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై బాలల హక్కులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంఈఓ వీరస్వామి, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, గైనకాలజిస్ట్ డాక్టర్ భవాని, హెచ్ఎం నాగశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇంటింటా జ్వర సర్వే

**కరకగూడెం:** కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఇంటింటా తిరుగుతూ జ్వర సర్వే నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి పరీక్షించి మందులను అందజేశారు. వర్షంలోనూ గ్రామంలో కలియ తిరుగుతూ పారిశుద్ధ్యం పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఈసం నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు పద్మ, రుక్మిణి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### పండ్లు, బ్రెడ్ పంపిణీ

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలో ఉన్న ఏరియా ఆస్పత్రిలో శనివారం రోటరీ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో అధ్యక్షుడు దార బాలాజీ రావు అధ్యక్షతన ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది గర్భిణులకు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలంసెక్రటరీ విద్యాసాగర్, కోశాధికారి శ్రీనివాస్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవికుమార్, పాస్ట్ ప్రెసిడెంట్స్ పి.శ్రీమహాలక్ష్మి, యశోద రాంబాబు, రఫీ పాల్గొన్నారు.

### వేంకటేశ్వర కల్యాణం

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని, శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు, వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా, కళ్యాణంను జరిపించారు. భక్తులు కల్యాణాన్ని కనులవిందుగా తిలకించారు. ఆలయ మేనేజర్ వెంకటరమణ ఏర్పాట్లు చేశారు.

### ఆలయాల సందర్శన

**అశ్వాపురం:** అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో ఎంపీటీసీలు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రామప్ప వేయి స్తంభాల దేవాలయాలను ఎంపీపీ, ఎంపీటీసీలు సందర్శించారు. ఆలయాలను సందర్శించిన వారిలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.ఖదీర్, ఎంపీటీసీలు తాటి పూజిత, గాదె జయ, కొమరం చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గోదా‘వర్రీ’ ఉధృతం

గత వారం రోజులుగా పెరుగుతూ, తగ్గుతు దోబూచులాడుతున్న గోదావరి శనివారం సాయంత్రానికి మూడో ప్రమాద హెచ్చరికను దాటి ఉగ్ర రూపం దాల్చింది. గోదావరి వరదతో పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లోని వందలాది ఎకరాల పంటచేలు నీటమునిగాయి. వరద నీరు ఇళ్లు, రహదారులను ముంచెత్తింది. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు పలు గ్రామాల వారిని పునరావాస కేంద్రాలను తరలించారు. వాగులు, వరదల వద్ద పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. స్థానికులను అప్రమత్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


చర్ల: కుదునూరు వద్ద నీటమునిగిన చర్ల- భద్రాచలం రహదారి


బూర్గంపాడు-సారపాక మధ్య రాష్ట్రీయ రహదారిపైకి చేరిన గోదావరి వరద


బూర్గంపాడు: నాగినేనిప్రోలు వద్ద నీట మునుగుతున్న పత్తిచేలు


అశ్వాపురం: బట్టీలగుంపు-రాంనగర్ గ్రామాల మధ్య నిలిచిన వరద


బూర్గంపాడు: పునరావాస కేంద్రాలకు తీసుకొచ్చిన సామగ్రి


అశ్వాపురం: మొండికుంట-ఇరవెండి రహదారిపై నిలిచిన రాకపోకలు


అశ్వాపురం: నెల్లిపాక గ్రామంలో గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

## పంచాయతీల్లో గ్రామసభలు


చంద్రుగొండ: మొక్కలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ సంధ్యారాణి

**అశ్వారావుపేటరూరల్:** మండలంలోని పేరాయిగూడెం, గుమ్మడ వల్లి, అచ్యుతా పురం, రామన్న గూడెం, కేశప్పగూడెం, మల్లాయిగూడెం, కొత్త మామిళ్లవారిగూడెంతోపాటు మరికొన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఈ మేరకు ఆయా పంచాయతీల ప్రత్యేకాధికారుల అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రామ సభల్లో స్వచ్ఛ భారత్, పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీటిపై చర్చించారు. అలాగే ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ గ్రామ సభల్లో ప్రత్యేకాధికారులు, తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**చంద్రుగొండ:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఫలితంగా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని తహసీల్దార్ సంధ్యారాణి అన్నారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో శనివారం స్వచ్ఛభారత్ ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అయిన తహసీల్దార్ సంధ్యారాణి మాట్లాడుతూ.. ఘన, ద్రవ వ్యర్థాల సక్రమ నిర్వహణతోపాటు గ్రామ పరిసరాలను, రోడ్లు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సభలో ఎంపీటీసీ లంక విజయలక్ష్మి, ఎస్డీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

**మణుగూరురూరల్:** వర్షాకాల నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, నూతన పంచాయతీ కార్యదర్శి గాదె ప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున మురుగునీటి నిలువలు ఏర్పడి దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయని, విషజ్వరాలు, అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎవరైనా అనారోగ్యాలకు గురైతే ఆస్పత్రుల్లో సంప్రదించాలన్నారు. గ్రామసభలో ఉపాధిహామీ పనుల ఫీల్డ్ ఆఫీసర్ మంగయ్య, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలను సందర్శించిన సీఐ

**మణుగూరురూరల్:** మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి వరద ముంపు ప్రభావిత ప్రాంతాలైన కమలాపురం, చినరాయిగూడెం గ్రామాలను మణుగూరు సీఐ ఎస్.సతీష్‌కుమార్ శనివారం సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అక్కడి గ్రామస్తులకు గోదావరి వరద ఉధృతి, వరదల పట్ల అప్రమత్తం చేస్తూ పలు సూచనలు ఇచ్చారు. రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు, పెరుగుతున్న గోదావరి ఉధృతి నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి ఉధృతి పెరిగి నేటి రాత్రికి మూడో హెచ్చరిక నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వరద గ్రామాలను పోటెత్తే ప్రమాదం ఉందని, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు అనుక్షణం జాగ్రత్తగా ఉండాలన్నారు. పశువుల కాపరులు, పంటపొలాల యజమానులు వాగులు, వంకలు, చెరువుల వద్దకు వెళ్లొద్దని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తద్వారా తాము సహాక చర్యలు చేపట్టడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

## హాస్టళ్లలో వైద్యశిబిరాలు

**మణుగూరురూరల్:** మండలంలోని రాజీవ్‌గాంధీనగర్‌లో గల మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర, లంకమల్లారంలోని టీజీటీడబ్ల్యూ ఆర్‌జేసీ బాలికల హాస్టళ్లలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ... భారీ వర్షాలు కురుస్తున్నాయని, విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, తడి దుస్తులు ధరించవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఉమేష్, సుమా, ఎంఎల్‌హెచ్‌పీలు వినయ్, వెంకటలక్ష్మి, సౌభాగ్య, ఆశావర్కర్లు, హాస్టల్స్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**ఆశ్రమ పాఠశాలల్లో..**

**చర్లరూరల్:** మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్ద మిడిసిలేరు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థినిలకు వైద్యాధికారిని దివ్యనయన శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 50 మందికి చర్మ వ్యాధులకు సంబంధించి,జలుబులకు కావలసిన మందులను పంపిణీ చేశారు. ఇద్దరు విద్యార్థిణులకు జ్వరం సోకగా వారికి రక్త పరీక్షలు చేసినట్లు వారికి మలేరియా లేదని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు చంద్రకళ, డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్ఇఒ బాబూరావు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ దీప్తి మౌనిక, హెల్త్ అసిస్టెంట్లు సుబ్బారావు, వీరమ్మ, వార్డెన్ రాధ, హాస్టల్ ఏఎన్ఎం మౌనిక, ఆశా కార్యకర్త కుమారి పాల్గొన్నారు.


మణుగూరురూరల్: విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శివకుమార్

**మణుగూరుటౌన్:** సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మండలంలోని రామానుజవరం, కొండాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ శేషగిరిరావు 110 మందికి బీపీ, షుగర్, తదితర వ్యాధులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కొండాయిగూడెంలో కాల్వల వద్ద పరిసర ప్రాంతాలలో దోమల మందు పిచికారీ చేసి బ్లీచింగ్ చేయించారు. సిబ్బంది రూపశ్రీ, నందిని, శ్రవణ్, మాజీ సేవ కో-ఆర్డినేటర్ యూసఫ్ పాల్గొన్నారు.

### డిగ్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

**అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో, ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల స్పెషల్ ఆఫీసర్ బురాన్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో బురాన్ మాట్లాడుతూ.. గతంలో ఈ కళాశాలలో ప్రవేశాల కొరకు పరీక్ష రాసిన, రాయని విద్యార్థులు కూడా ప్రవేశ దరఖాస్తుకు అర్హులేనని అన్నారు. డిగ్రీలో బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంపీసీ, బీజెడ్‌సీ), బీకామ్(సీఏ, జనరల్), బీఏ(హెచ్‌పీఎస్) కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కళాశాలలో ఉచిత విద్య, వసతితో పాటుగా తదితర సౌకర్యాలు ఉచితంగా కల్పించబడునని తెలిపారు. ఈ నెల 31వ లోపుగా కళాశాలకు వచ్చి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### ట్రిపుల్ ఐటీలో సీటు

**అశ్వారావుపేట:** స్థానిక శ్రీ గౌతమి పబ్లిక్ స్కూల్‌లో పదోవ తరగతి చదివిన మానేపల్లి ప్రితీక ప్రిన్సెస్ బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కొఠారు చలపతి తెలిపారు. మానేపల్లి శ్యామ్, కృష్ణవేణి దంపతుల కుమార్తె ఈ ఏడాది జరిగిన పదోవ తరగతి వార్షిక పరీక్షల్లో ప్రితీక ప్రిన్సెస్ 10/10జీపీఏ సాధించిందని అన్నారు. ట్రిపుల్ సీటుకు అర్హత సాధించినట్లు చెప్పారు.

### ఆవిర్భావ దినోత్సవం

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులో గల సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ 86వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్‌భద్రా, సారపాక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్లబ్ ఇన్‌భద్రా రోట్రాక్టర్ అధ్యక్షుడు అరవిందన్, సెక్రటరీ గురిందపల్లి చైతన్యలు సీఆర్పీఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ రితేశ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులను శాలువాతో ఘనంగా సత్కరించారు.

### పారిశుద్ధ్య పనులు

**మణుగూరురూరల్:** మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయితీ అశోక్‌నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ పశు వైద్యశాలలో శనివారం పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. వైద్యశాలలోని చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు పర్యవేక్షించగా.. ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఫ్యాన్లు వితరణ

**గుండాల:** మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వాసవి క్లబ్ గ్రీన్‌ఫీల్డ్స్ ఆధ్వర్యంలో శనివారం నాలుగు ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్లు అందించారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. తనతో పాటు ప్రధాన కార్యదర్శి పుల్లఖండం ఉపేందర్, ట్రెజరర్ అనుమోలు వెంకటేశ్వర్లు స్పాన్సర్ చేశారని తెలిపారు. అనంతరం పుల్లంఖండ ఉపెందర్, తేరాల రాజేశ్వరావులు రోగులకు అరటిపండ్లు, బ్రెడ్ పాకెట్లను అందించారు. అనంతరం వైద్యాధికారి మనీష్ రెడ్డి మాట్లాడారు. మానాల వీరన్న, మానాల ప్రభాకర్, మానాల శ్రావన్, గౌరిశెట్టి సత్యనారాయణ, గౌరిశెట్టి ప్రభాకర్, తవిడిశెట్టి నాగరాజు, తాటిపల్లి సత్యం, రాంబాబు, శ్రీశైలం, నాగమల్లయ్య, పూజిత్, వీరన్న, పూజిత్ పాల్గొన్నారు.

## గంజాయి వినియోగాన్ని అరికట్టాలి

**అశ్వాపురం:** గంజాయి రవాణా, వినియోగాలను అరికట్టాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ రవీందర్‌రెడ్డి శనివారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, రిజిష్టర్లు తనిఖీ చేశారు. గదులు, స్టేషన్ ఆవరణను పరిశీలించారు. సీఐ, ఎస్సైలు, సిబ్బందితో డీఎస్పీ సమావేశమయ్యారు. డయల్ 100, విజిబుల్ పోలిసింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సైలు సురేష్, తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

## ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

**గుండాల:** ఆళ్లపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ధీరావత్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ రమాదేవి ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారు కాగా కొంత కాలం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహుల పేట ఎంపీడీఓ శ్రీనివాస్ ఆళ్లపల్లి బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన ఆయన మాట్లాడుతూ.. మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

**ఎంపీఓలుగా..**

**అశ్వారావుపేటరూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అశ్వారావుపేట ఎంపీఓగా ప్రసాద్ రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గడిచిన కొంతకాలంగా ఇక్కడ ఎంపీవోగా పని చేస్తున్న సీతారామరాజు సెలవుపై వెళ్లగా, ఆయన స్థానంలో దుమ్ముగూడెం ఎంపీఓగా పని చేస్తున్న ప్రసాద్ రావును డిప్యూటేషన్‌పై ఉన్నతాధికారులు బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానికం కార్యాలయంలో విధుల్లో చేరగా, పలువురు కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**దుమ్ముగూడెం:** దుమ్ముగూడెం మండల ఎంపీఓగా బద్ది రామకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు.గుండాల మండలంలో విధులు నిర్వహించిన రామకృష్ణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న ముత్యాలరావు అశ్వాపురం మండలానికి బదిలీ కాగా.. ఆయన స్థానంలో రామకృష్ణ మండలానికి వచ్చారు. రామకృష్ణను పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

### ఐరన్ మెష్ ఏర్పాటు

**ములకలపల్లి:** ములకలపల్లి శివారు పాములేరు వాగుపై నిర్మించిన ఇనుప వంతెనకు అధికారులు ఐరన్ మెష్ ఏర్పాటు చేశారు. ఈ వాగుపై నూతనంగా బ్రిడ్జి నిర్మిస్తున్న క్రమంలో రాకపోకలకు అవాంతరాలు కలుగకుండా ఇటీవలె ఇనుప వంతెన నిర్మించారు. అయితే వంతెనకు ఇరువైపులా ప్రమాదాలు వాటిల్లే అవకాశలు ఉండడంతో మెష్ అమర్చారు.

### పాఠశాలలో ‘శిక్షా సప్తాహ్’


నాటిన మొక్కల వద్ద ప్లకార్డులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**కరకగూడెం:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్లో విజ్ఞానం, వినోదం పెంచేందుకు నిర్వహిస్తున్న ‘శిక్షా సప్తాహ్’కార్యక్రమం శనివారం ఆరో రోజుకు చేరింది. ఇందులో భాగంగా కరకగూడెం ఎంపీపీఎస్, జెడ్పీ పాఠశాలలో పోషకాహార దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు మొక్కల పెంపకం, కూరగాయల తోటలపై అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలలో నాటిన మొక్కలను రక్షించుకుంటామని విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.ఈ సందర్భంగా జెడ్పీ పాఠశాల హెచ్ఎం మంజులా మాట్లాడారు.

### పునరావాస కేంద్రాల్లో ఫాగింగ్

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలో వరద ముంపు బాధితుల కోసం ఏర్పాట చేసిన పునరావాస కేంద్రాలలో పరిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ క్రమంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పునరావాస కేంద్రాలలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేస్తూ, విస్తృతంగా బ్లీచింగ్ చల్లుతూ, కేంద్రాలలో ఫ్లడ్ లైట్లతో పాటు ముంపు బాధితుల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు.

### అమ్మవారికి బోనాలు

**దమ్మపేట:** మండల కేంద్రంలోని గాయత్రి ఆశ్రమంలో అమ్మవారికి, భారీ ఎత్తున స్థానిక మహిళలు బోనాలను శనివారం సమర్పించారు. ఆషాడ మాస బోనాల ఉత్సవాలను, గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకులు మూర్తిజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని కూరగాయాలతో శాకాంబరి రూపంలో అలంకరణ చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

### జీపీఎఫ్ అమలు చేయాలి

**మణుగూరురూరల్:** విద్యుత్ ఉద్యోగులందరికి జనరల్ ప్రావిడెంట్ ఫండ్(జీపీఎఫ్) అమలు చేయాలని ఈపీఎఫ్ టు జీపీఎఫ్ సాధన కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం కమిటీ ఆధ్వర్యంలో బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు బి.మంగీలాల్, సీహెచ్ రాజబాబులు మాట్లాడారు. బి.భీమ్యా, కె.కోటేశ్వరరావు, పి.రవీంధర్‌రెడ్డి, ఎం.రాజమనోహర్, పివి.సురేష్, అంబాల శ్రీనివాస్, వి.ప్రసాద్, బి.సత్యనారాయణ, ఎస్‌కె.సాధిక్, వీరస్వామి, నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

### రాకపోకలు పునరుద్ధరించాలి

**భద్రాచలంఅర్బన్:** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా జిల్లాలోని పలు గ్రామాలకు రాకపోకలు బంద్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యను తక్షణమే ఐటీడీఏ పీఓ పరిష్కరించాలని ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం శనివారం ఒక ప్రకటనలో కోరారు.

### బాధిత కుటుంబానికి వితరణ

**మణుగూరురూరల్:** మున్సిపాలిటి పరిధిలోని విఠల్‌రావునగర్ ప్రాంతానికి చెందిన జర్పుల హతిరాం ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో వంట సామాగ్రి, 25కేజీల బియ్యం, దుప్పట్లు, దిండ్లను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు బేతంచర్ల వెంకటేశ్వరరావు, ఊటుకూరి సత్యనారాయణ, రంగా శ్రీనివాస్, తమ్మిశెట్టి వాసు, సాయిభార్గవ్, సురేందర్ పటేల్, బి.అనిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, బండ్ల బాల, యుగంధర్, సాయిని బాలయ్య, నరసింహ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సౌకర్యాలు కల్పించాలి

**భద్రాచలంఅర్బన్:** గోదావరికి వరద పెరుగుతున్న సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేస్తున్న వరద బాధితుల కోసం ఏర్పాడు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, ముఖ్యంగా గర్భిణుకు చిన్న పిల్లలకు పాలు గుడ్లు, పోషకాహారం అందించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలో వరద ప్రభావిత కాలనీలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు వరద సహాయ చర్యలో పాల్గొని మాట్లాడారు. బాధితులకు రూ.10వేలు పరిహారంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐనాల రామకృష్ణ, దానియేలు ప్రదీప్, లక్ష్మణ్, బడిశా నాగరాజు, చిట్టిమల్ల అనిల్, జల్లి రామకృష్ణ, తెల్లం రాణి, యాదామని తదితరులు ఉన్నారు.

## శాశ్వత పరిష్కారం చూపాలి


ఏఎంసీ కాలనీలో ముంపు బాధితుల సహాయక చర్యల్లో సీపీఎం నాయకులు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం సరిహద్దున్న ఉన్న ఎటపాక పరిధిలో ఉన్న స్లూయిజులు లీకు కావడంతో వర్షపు నీటి బ్యాక్ వాటర్‌తో ప్రతి ఏటా భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీలు వరద ముంపునకు గురవుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు అన్నారు. శనివారం పట్టనంలోని ఏఎంసీ కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీలో పర్యటించి వరద ముంపునకు గురైన ఆయా కాలనీ ప్రజలకు అండగా సీపీఎం నాయకులు, కార్యకర్తలు వరద సహాయక చర్యల్లో ప్రత్యక్షంగా పాల్గొనట్లుగా వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడుతూ.. గోదావరి వరద ముంపు నుంచి భద్రాచలం పట్టణ రక్షణకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. గత రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో వచ్చిన వర్షపు వరద నీటితోపాటు భద్రాచలం, ఎటపాక భూభాగంలో ఉన్న కరకట్ట స్లూయిజులు లీక్ అవ్వడంతో గోదావరి వరద నీరు పట్టణంలోకి ప్రవేశించి కాలనీలు ముంపుకు గురికావడం జరిగిందని అన్నారు. తక్షణమే జిల్లా అధికారులు, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అధికారులతో చర్చించి సదరు కరకట్ట స్లూయిజులు లీకు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గోదావరి వరదలకు సంబంధించి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు గోదావరి ఫోర్ కాస్టును వరద ముంపు కాలనీల ప్రజలకు తెలియజేసి అప్రమత్తం చేయాలని వారు కోరారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వరద బాధితులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, అదే విధంగా ముంపుకు గురైన ప్రతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పదివేల రూపాయలు నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్ స్థానిక నాయకులు యు జ్యోతి, సత్యవతి, నరసింహారావు, సీత, గోవర్ధన ఝాన్సీ, సరోజినీ, పూర్ణ, రాము పాల్గొన్నారు.